

వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## నాణ్యతా ప్రమాణాలను పాటించాలి

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్, జూలై 10 : వంతెన నిర్మాణ పనులను అత్యంత నాణ్యతతో చేపట్టాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులకు సూచించారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని అయ్యవారిపల్లి గ్రామ శివారులో రూ.4.5కోట్లు, కొందుర్గు మండలంలోని తంగేడుపల్లి వద్ద రూ.3.9కోట్లతో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

## పశుపోషణలో మేలైన పద్ధతులు పాటించాలి



ఆరుట్లలో పాడి పరిశ్రమపై రైతులకు అవగాహన కల్పిస్తున్న రత్నాకర్

మంచాల, జూలై 10: పశుపోషణలో మేలైన యాజమాన్య పద్ధతులను పాటించాలని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ అన్నారు. బుధవారం మంచాల మండలం ఆరుట్ల రైతు వేదికలో పాడి రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి పాల దిగుబడి పొందడం కోసం మేలైన పాడి పశువులను కొనుగోలు చేయాలని చెప్పారు. పశువుల్లో వచ్చే వ్యాధులైన నట్టల నివారణ, పొదుగు వ్యాధి నివారణ టీకాలు, సంకరజాతి పశువుల్లో వచ్చే పునరుత్పత్తి సమస్యలు, మేలైన పశుగ్రాసం వంటి వాటిపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, ఆదర్శ రైతు ప్రతాప్ రెడ్డి, మైక్రో ల్యాబ్ మేనేజర్ డి.శంకర్, రైతులు సురేశ్, నర్సింహారెడ్డి, కృష్ణ ఐలయ్య, కొండల్‌రెడ్డి, సత్తిరెడ్డి, బాల్‌రాజ్, వెంకట్ రెడ్డి, పుణ్యమూర్తి, రమేశ్, అంజయ్య పాల్గొన్నారు.

## ఆర్‌అండ్‌బీ డీఈఈకి పలువురి నివాళి



డీఈఈ దానయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు

కడ్తాల్, జూలై 10: కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన ఎగిరిశెట్టి దానయ్య వనపర్తి జిల్లాలో ఆర్‌అండ్‌బీలో డిప్యూటీ డీఈగా విధులు నిర్వహిస్తున్నాడు. దానయ్య అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి నగరంలో ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మంగళవారం రాత్రి కడ్తాల్ గ్రామానికి చేరుకొని దానయ్య మృతదేహానికి నివాళులర్పించారు. అలాగే బుధవారం ఉదయం దానయ్య మృతదేహానికి స్థానిక నాయకులతో కలసి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, మాజీ ఉప సర్పంచ్‌లు రామకృష్ణ, పాండూనాయక్, నేతలు భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్, బీక్యానాయక్, వేణుగోపాల్, జహంగీర్ అలీ, లక్ష్మయ్య, సత్యం, శ్రీనివాస్, రమేశ్, కృష్ణ పాల్గొన్నారు.

## ఆదర్శనీయురాలు మొల్లమాంబ

షాద్‌నగర్‌టౌన్, జూలై 10: ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే రీతిలో రామాయణాన్ని రచించిన కవయిత్రి మొల్లమాంబ నేటి తరానికి ఆదర్శనీయురాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన కవయిత్రి మొల్లమాంబ విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పండితులకే కాకుండా అందరికీ అర్థమయ్యే విధంగా రామాయణాన్ని సరళంగా రచించిన మహనీయురాలని కొనియాడారు. అదే విధంగా ఆషాఢ మాసం సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని పోచమ్మతల్లి దేవాలయానికి మొదటి బోనాన్ని సమర్పించారు. దేవాలయంలో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ విశ్వం, సంఘం నాయకులు పాల్గొన్నారు.

## కేంద్రం కార్మిక హక్కులను కాలరాస్తుంది

మొయినాబాద్, జూలై 10 : కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాసే కుట్ర చేస్తుందని భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఎం. ప్రభుదాస్ అన్నారు. కార్మికుల కోరికల దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం విధానాలను వ్యతిరేకిస్తూ గురువారం మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ గ్రామంలో భవన నిర్మాణ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.



నాగిరెడ్డిగూడలో నిరసన తెలుపుతున్న కార్మికులు

# పర్యావరణాన్ని కాపాడాలి

### చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల రూరల్, జూలై 10 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన వనమహోత్సవం కార్యక్రమం బుధవారం చేవెళ్ల మండల పరిధిలోని ముడిమ్యాల్ గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరిత లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని, నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ సుభాషిణి, ఎంపీడీవో హిమాబిందు, ఎంపీవో విఠలేశ్వర్‌జీ, పంచాయతీ కార్యదర్శి రియాజుద్దీన్, వన సంరక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి**

యాచారం : మండలంలో వనమహోత్సవం కార్యక్రమం ద్వారా నాటిన ప్రతి మొక్కనూ బతికించాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తక్కళ్లపల్లితండాలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మండలంలోని అన్ని గ్రామాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆయన కోరారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో లింగయ్య తదితరులున్నారు.

**మొక్కలను కాపాడే బాధ్యత అధికారులదే..**

ఇబ్రహీంపట్నం : వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్కనూ కాపాడే బాధ్యతను అధికారులు తీసుకోవాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని గోశాల రోడ్డులో చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మొక్కలు నాటి అడవులను పెంచటానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. నాటిన మొక్కలను సంరక్షించకపోవటంతో ప్రజాధనం వృథా అయ్యే అవకాశముందన్నారు. వన మహోత్సవంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వన మహోత్సవ కార్యక్రమం పండుగలా జరుగాలని, ఇందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. అటవీసంపదను పెంపొందించటం కోసం పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించే బాధ్యత అధికారులు తీసుకోవాలని అన్నారు. నాటిన మొక్కలను ఎండిపోకుండా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నీళ్లుపోసే కార్యక్రమం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, వైస్‌చైర్‌పర్సన్ మంగ, కౌన్సిలర్లు భానుబాబు, జగన్, బాలరాజు, సునిత, తహసీల్దార్ అనిత, మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్, నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, జగదీశ్, పాండురంగారెడ్డి, టోని, రాజు, చందు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం : గోశాల రోడ్డులో మొక్క నాటి నీళ్లు పడుతున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

# విద్య, వైద్యానికి పెద్దపీట

### కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఆమనగల్లులో భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్ కర్నూల్ జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీసింగ్

ఆమనగల్లు, జూలై 10: పేదలకు మెరుగైన విద్య, వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లులో బుధవారం రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు, నాగర్‌కర్నూల్ జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీసింగ్, ఉప వైద్యాధికారి గీతతో కలిసి 50 పడకల సీహెచ్‌సీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ నాలుగు మండలాల కూడలైన (కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి, ఆమనగల్లు) ఆమనగల్లులో రూ 17.50 కోట్లతో 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో 50 నుంచి 100 పడకలకు స్థాయి పెంచే విధంగా అధునాతన భవనం నిర్మిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ వసతి గృహాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, అందుకు అధికారులు భూసేకరణ చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లులో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం పూర్తి చేస్తామని, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల భవనాలను నిర్మిస్తామని తెలిపారు. ఈ ప్రాంతంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి(ఎన్‌ఐటీ) నిర్మాణం చేపడుతామని ఆయన పేర్కొన్నారు. గ్రూప్స్ పరీక్షలో ఒక పోస్టుకు 50 మందికి బదులు 100 మంది అభ్యర్థులను ఎంపిక చేయాలని గ్రూప్స్ రాసిన అభ్యర్థులు అడుగుతున్నారని, ఇలా చేస్తే న్యాయపరంగా సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. డీఎస్సీ వాయిదా వేయాలని రాజకీయ పార్టీల నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ఆగస్టు వరకు రైతు రుణమాఫీ రూ. రెండు లక్షలు ఏకకాలంలో చేస్తామన్నారు. ఏడాది సెప్టెంబర్ నెలాకరుకు కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డీ-82 కాల్వ నిర్మాణం పూర్తి చేసి కల్వకుర్తి మండలంలోని జంగారెడ్డిపల్లి నుంచి మాడ్గుల మండలం నాగిళ్ల వరకు 35 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. అనంతరం జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీసింగ్ మాట్లాడారు. కల్వకుర్తి నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మాజీ కో ఆర్డినేటర్ జంగయ్య, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, మున్సిపల్ చైర్మన్ రాంపాల్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు జగన్, మానయ్య, తహసీల్దార్ లలిత, మున్సిపల్ కమిషనర్ వసంత, వైద్యాధికారులు నరేందర్, నాగరాజు, మండల విద్యాధికారి సర్దార్ నాయక్, కాంగ్రెస్ నాయకులు మెకానిక్ బాబా, కృష్ణానాయక్, శ్రీశైలం పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

### భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్‌రావు

షాద్‌నగర్‌టౌన్, జూలై 10: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్‌రావు డిమాండ్ చేశారు. కార్మికుల కోర్కెల దినోత్సవం సందర్భంగా బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని భవన నిర్మాణ కార్మికుల సమావేశమై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం 1996భవన నిర్మాణ కార్మికుల సమగ్ర కేంద్ర చట్టాలను రక్షించడంతో పాటు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలన్నారు. అదే విధంగా నిర్మాణంలో వాడే ఇసుక, ఇటుక, సిమెంట్, స్టీల్, పెయింట్ వంటి ముడి సరుకుల ధరలను నియంత్రించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వేలాది కార్మికుల నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలని కోరారు. వెల్ఫేర్ బోర్డుకు సంబంధించి అడ్వైజర్ కమిటీలో కార్మిక సంఘాల ప్రతినిధులను నియమించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనూనాయక్, నాయకులు రవికుమార్, రాజూనాయక్, జంగయ్య, శ్యామ్, మల్లేశ్, శ్రీరాములు, రమేశ్, గోపాల్, యాదయ్య, చెన్నయ్య, శ్రీశైలం, విజయ్‌కుమార్, వెంకటేశ్, రాములు, పాండు, కృష్ణయ్య పాల్గొన్నారు.

**కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలి**

షాద్‌నగర్ మున్సిపల్, గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ శ్రీనూనాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల కోర్కెల దినోత్సవం సందర్భంగా కార్మికులతో కలిసి పట్టణంలోని డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్‌సింగ్‌కు వినతి పత్రాన్ని అందజేసి మాట్లాడారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం హయ్యర్ పెన్షన్‌ను కార్మికులకు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు రాజు, యాదయ్య, కిష్టయ్య, వెంకటయ్య, కమలమ్మ, లక్ష్మమ్మ, అంజమ్మ, యాదయ్య, రాములమ్మ, సత్యమ్మ, లక్ష్మమ్మ, జ్యోతి, కుర్మయ్య పాల్గొన్నారు.

**లేబర్ కోడ్‌లను అమలు చేయాలి**

షాబాద్ : కార్మికుల శ్రమను కంపెనీ యాజమాన్యాలు దోచుకుంటున్నాయని సీఐటీయూ చందనవెల్లి పారిశ్రామిక వాడ క్లస్టర్ కన్వీనర్ అల్లి దేవేందర్ అన్నారు. కార్మికుల కోర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం షాబాద్ మండల పరిధిలోని చందనవెల్లి పారిశ్రామిక వాడ ప్రాంతంలో కార్మికులతో కలిసి కోర్కెల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తామని ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ క్లస్టర్ కమిటీ సభ్యులు నర్సింహ, సత్తయ్య, రాములు, సాయిలు పాల్గొన్నారు.



భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కార్మికులతో కలిసి డిమాండ్ చేస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్‌రావు

# నూతన చట్టాలపై అవగాహన అవసరం



నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కొత్తూరు, జూలై 10: ఇటీవల కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన చట్టాలపై పౌరులు అవగాహన కలిగి ఉండాలని కొత్తూరు ఎస్‌ఐలు జి. శ్రీనివాస్, కె. శ్రీనివాస్ అన్నారు. కొత్తూరు మండలంలోని వివిధ గ్రామాల్లో తిరుగుతూ బుధవారం నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండియన్ పీనల్ కోడ్ స్థానంలో భారతీయ న్యాయ సంహిత బిల్లు-2023ను, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ సాక్ష్యాల చట్టం 2023ను, ఇండియన్ క్రిమినల్ ప్రొసిజర్ కోడ్ స్థానంలో నాగరిక్ సురక్ష సంహిత 2023 అనే పేర్లతో కొత్త చట్టాలను తెచ్చారన్నారు. దేశంలో అసాంఘిక, తీవ్రవాద, హత్యలు, స్త్రీలు, బాలికలపై లైంగికదాడులు, కిడ్నాప్ వంటి అనేక నేరాలకు కఠినమైన శిక్షలను అమలు చేసేందుకు కొత్త చట్టాలు దోహదపడుతాయన్నారు. ముఖ్యంగా మహిళల గౌరవానికి భంగం కలిగేలా ప్రవర్తిస్తే ఐపీసీ 354 ప్రకారం రెండేళ్ల జైలు శిక్ష విధించేలా కొత్త చట్టాలు ఉన్నాయన్నారు. ఇది వరకు ఉన్న ఇండియన్ పీనల్ కోడ్‌లో హత్యానేరం 302 కింద కేసు నమోదు చేసేవారని చెప్పారు. కానీ ఇప్పుడు అది భారత న్యాయ సంహిత చట్టం సెక్షన్ 101, 99 కింద నమోదు చేస్తారని అన్నారు.

**కొత్తూరు తండాలో...**

మున్సిపాలిటీ పరిధిలోని కొత్తూరు తండాలో న్యూ క్రిమినల్ లాస్, సైబర్ ఫ్రాడ్, యాంటీ డ్రగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించామని కొత్తూరు ఎస్‌ఐ జి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో తండా వాసులు 45 మంది పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ సంఘాన్ని అభివృద్ధి చేద్దాం

చేవెళ్లటౌన్, జూలై 10: కష్టజీవులు, కార్మిక వర్గానికి అండగా నిలబడే ఏఐటీయూసీ సంఘాన్ని అభివృద్ధి చేద్దామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు తెలిపారు. బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను తుంగలో తొక్కిందన్నారు. కార్మిక చట్టాలను కోడ్‌లోకి మార్చి కార్మికులకు హక్కులే లేకుండా చేయడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. 16 నెలలుగా పేదలు ఇండ్ల స్థలాలు లేక గుడిసెలు వేసుకొని నివసిస్తున్న వారికి ఇండ్ల స్థలాలు కేటాయించాల్సిన ప్రభుత్వం దౌర్జన్యాలకు దిగడం బాధాకరమని ఆయన మండిపడ్డారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కే. రామస్వామి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జైపాల్ రెడ్డి, మండల కార్యదర్శి సత్తిరెడ్డి, సహాయ కార్యదర్శి మక్బూల్, అంజయ్య, మహిళ నాయకురాలు మంజుల, జిల్లా కౌన్సిల్ సభ్యులు శివయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్వారీలో పడి కార్మికుడు మృతి

షాద్‌నగర్, జూలై 10: విధులు నిర్వహిస్తున్న ఓ కార్మికుడు ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన కొందుర్గు మండల పరిధిలోని పరమేశ్వర క్రషర్‌లో జరిగింది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం గురజాల గ్రామానికి చెందిన రూపం రవి (40) కార్మికుడు కొన్ని రోజులుగా పరమేశ్వర క్రషర్ క్వారీలో విధులు నిర్వహిస్తున్నాడు. ప్రమాదవశాత్తు జారిపడి అక్కడిక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న క్రషర్ నిర్వాహకులు గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాన్ని షాద్‌నగర్ సర్కారు దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు క్రషర్ నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే మృతిచెందాడని ఆరోపించడంతో పోలీసులు జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఓ కుమారుడు, కూతురు ఉన్నారు.

## పరిశ్రమలో ప్రమాదం.. కార్మికుడు మృతి



రవిచంద్ర (ఫైల్)

నందిగామ, జూలై10: పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తు కింద పడి తీవ్రగాయాలై మృతి చెందిన ఘటన నందిగామ మండలం నాట్కో పరిశ్రమలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు మండలం పెంజర్ల గ్రామానికి చెందిన వీర్లపల్లి రవిచంద్ర (19) కొన్ని రోజులుగా నాట్కో కంపెనీలో సబ్ కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం హైడ్రలిక్ లిఫ్ట్ సాయంతో శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడటంతో రవిచంద్రతో పాటు అదే గ్రామానికి చెందిన మహేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేటు హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో రవిచంద్ర మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మహేశ్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడు రవిచంద్ర తల్లి సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నందిగామ పోలీసులు తెలిపారు.



## సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్, జూలై 10: సీఎం రేవంత్‌రెడ్డిని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయంలో కలిశారు. చేవెళ్ల నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులు, రోడ్డు మరమ్మతుల గురించి ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి తదితరులున్నారు.

## ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

ఆమనగల్లు, జూలై 10 : ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ అన్నారు. బుధవారం ఆయన ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, రిసెప్షన్, లాకప్ పరిసరాలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వారి విధులకు సంబంధించిన సూచనలు చేశారు. పట్టణంలోని ప్రతి కాలనీల్లో సీసీ కెమెరాలు అమర్చేవిధంగా ప్రజలను చైతన్య పరచాలన్నారు. సైబర్ నేరాల విషయంలో ప్రభుత్వం చేస్తున్న సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్‌ఐ వెంకటేశ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## కనీస వేతనాలు అమలు చేయాలి



యాచారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

యాచారం, జూలై10: స్కీం వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట వివిధ రంగాల కార్మికులు ఆందోళన చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూజిల్లా సహాయకార్యదర్శిబ్రహ్మయ్య, మండల కన్వీనర్ చందునాయక్, సీఐటీయూ నాయకులు కృష్ణ, జంగయ్య, ఆండాలు, యాదమ్మ, సరిత, బాలమణి, అలివేలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల డిమాండ్లను నెరవేర్చాలి

నందిగామ, జూలై 10: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ ఉద్యోగులు చేస్తున్న న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ బుధవారం నందిగామ తహసీల్దార్ రాజేశ్వర్‌కు మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, టీచర్లు పాల్గొన్నారు.

## అసంపూర్తి పనులను పూర్తిచేయాలి

మంచాల, జూలై 10: మండలంలోని లోయపల్లి గ్రామంలో అసంపూర్తిగా ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, గ్రంథాలయ భవనం పనులను వెంటనే పూర్తిచేయాలంటూ బీజేవైఎం మండల అధ్యక్షుడు బండి రాజుగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం మంచాల ఎంపీడీవో బాలశంకర్ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రంథాలయ నిర్మాణ పనులు పూర్తి చేసి సౌకర్యాలు కల్పించాలని వారు కోరారు. ఆయన వెంట బీజేవైఎం నాయకులు శ్రీశైలం, మహేశ్, రాజు, శేఖర్, జంగయ్యగౌడ్, సురేశ్, ముఖేశ్ ఉన్నారు.

## పొలాలకు బాటను చూపాలి

షాబాద్, జూలై 10: తమ పొలాలకు వెళ్లేందుకు నక్షబాట సమస్యను పరిష్కరించాలని ముద్దెంగూడ గ్రామస్తులు, రైతులు బుధవారం షాబాద్ మండల కేంద్రంలో తహసీల్దార్ అన్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ముద్దెంగూడ నుంచి ఎర్రోనిగూడ గ్రామానికి వెళ్లే దారిలో సర్వేనెంబర్ 1480లో 7ఎకరాలకు పైగా పట్టా భూమి అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తుల పేర్లపై ఉందని చెప్పారు. ఆ భూమి కాకుండా 20ఫీట్ల మట్టి రోడ్డు(నక్షబాట)కూడా ఉందన్నారు. ముందు పొలాలకు రైతులను అందులో నుంచి పోనివ్వకుండా వారు అడ్డుపడుతున్నట్లు చెప్పారు. అదే రోడ్డులో స్మశానవాటిక కూడా ఉందని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి ఘటన స్థలంలో విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ముద్దెంగూడ గ్రామస్తులు కూర వెంకటయ్య, పర్వేద నర్సింహులు, వెంకటేశ్‌గౌడ్, సుదర్శన్, పాపిరెడ్డి, లింగం, రైతులు తదితరులున్నారు.


## ఎస్‌ఐ ప్రసాద్ బదిలీ



ఎస్‌ఐ ప్రసాద్‌కు వీడ్కోలు తెలుపుతున్న సహచర పోలీసులు

యాచారం, జూలై 10 : మండలంలోని మేడిపల్లిలో ఉన్న హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహించిన ఒరుసు ప్రసాద్ బుధవారం ఎల్బీనగర్ సీసీఎస్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ను సీఐ నర్సింహారావు, సిబ్బంది సన్మానించి వీడ్కోలు పలికారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993-94 విద్యా సంవత్సరానికి చెందిన 10వ తరగతి విద్యార్థులు గురువారం అజీజ్‌నగర్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు చెప్పిన గురువులు రవీంద్రనాథ్, వెంకటేష్‌యాదవ్‌లను సన్మానించారు. - మొయినాబాద్, జూలై10